క్లుప్తంగా

రూరల్ సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకారం



తెనాలి రూరల్: తెనాలి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా టి. వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి గుంటూరులోని చిలకలూరిపేట, ప్రకాశం జిల్లా ఒంగోలు, ఏఈబీ, చీరాలలో పని చేశారు. 2012లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన ప్రస్తుతం వడ్లమాను నుంచి తెనాలి రూరల్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, డీఎస్పీ బి. జనార్దనరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా ఇక్కడ రూరల్ సీఐగా పని చేస్తున్న కె. శ్రీనివాసరెడ్డి బాపట్ల డీఎస్పీకి బదిలీ అయిన సంగతి తెలిసిందే.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ కుమార్ పంప్స్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి, జిల్లా ప్రభుత్వ వైద్యశాల సహకారంతో ఇండస్ట్రియల్ ఏస్టేట్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. సంస్థకు చెందిన 250 మంది కార్మికులు, ఏఎస్ఎన్, చైతన్య కాలేజీల విద్యార్థులు రక్తదానం చేశారు. సంస్థ ఉద్యోగి బీఎస్సార్ మోహనరావు 10వ సారి, సునీల్ 25వ పర్యాయం, చైతన్య కాలేజీ ప్రిన్సిపాల్ 77వ పర్యాయం రక్తదానం చేసిన సందర్భంగా వారిని అభినందించారు. ఎండీ కొత్త సుబ్రమ్మణ్యం, రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి రక్తదానం ఆవశ్యకతను వివరించారు. రక్తదానంపై అపోహల్ని తొలగించుకోవాలని సూచించారు. రక్తదానంతో మరొకరి ప్రాణాల్ని నిలబెట్టిన వారు కాగలరని చెప్పారు. కొత్త సుబ్రహ్మణ్యం సతీమణి వసుంధర జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ఏర్పాటును అభినందించారు. కార్యక్రమంలో కొత్త హరికుమార్, శ్రీనివాస్, గడ్డిపాటి శేషగిరిరావు, డాక్టర్ రాధాబాయి, వాసుదేవుడు, సాయిప్రదీప్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రజల సహకారం అవసరం



తెనాలి రూరల్: దోమల నివారణకు ప్రజల సహకారం అవసరమని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం కోరారు. మలేరియా శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో తెనాలి ఐతానగర్ శివారు వైవీఆర్ కాలనీలో ఫ్రైడే-డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పర్యవేక్షణకు వచ్చిన మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలకు సూచించారు. సాయంత్రం పూట కిటికీలు, తలుపులు వేసుకోవడం, దోమ తెరలను వాడటం వల్ల వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, తెనాలి మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, వంగల పున్నారెడ్డి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి మల్లేశ్వరరావు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గోడలపై వాల్‌పోస్టర్లను అతికించారు.

రేపు సినీ నటి పూర్ణిమకు సత్కారం

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ ఆలాపన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విభావరి అనంతరం సినీ నటి పూర్ణిమకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

పల్లెవించిన కార్పొరేట్ వైద్యం

- కొల్లిపరలో అత్యాధునిక సామాజిక ఆరోగ్య కేంద్రం
- రూ.8.72 కోట్లతో నిర్మించిన భవన సముదాయం
- రేపు రాష్ట్ర మంత్రి విడదల రజినిచే ప్రారంభం



రూ.8.72 కోట్లతో నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవన సముదాయం

ఇది కదా.. అభివృద్ధి

తెనాలి: నియోజకవర్గంలోని మండల కేంద్రం కొల్లిపరలో గల సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన సముదాయం రూ.8.72 కోట్ల వ్యయంతో నిర్మాణం పూర్తయింది. ఎకరంపైగా విస్తీర్ణంలో నిర్మించిన ఆసుపత్రి భవన సముదాయాన్ని ఈనెల 4వ తేదీ ఉదయం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్యవిద్యశాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యక్షతన జరిగే సభలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు.

ఎమ్మెల్యే శివకుమార్ చొరవతో కొత్తరూపు

రోగులకు అవసరమైన వైద్యసేవలను క్రమపద్ధతిలోకి తీసుకొచ్చిన ప్రభుత్వం ఆసుపత్రి స్వరూపాన్ని సమగ్రంగా మార్చేందుకు సిద్ధమైంది. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవనం నిర్మాణాన్ని ఆరంభించారు. గ్రామానికే చెందిన భీమవరపు వీరారెడ్డి-ఆదెమ్మ జ్ఞాపకార్థం కుమారుడు గురవారెడ్డి-మీనాకుమారిలు రెండు దఫాలుగా 1.80 ఎకరాల భూమిని సమకూర్చారు. అందులో ప్రస్తుత సామాజిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఆ భవనం ముందుభాగంలో జీ+1 నూతన భవన సముదాయాన్ని రూ.8.72 కోట్ల వ్యయంతో నిర్మించారు. ఓపీ విభాగం, అత్యవసర విభాగం, ప్రసూతి విభాగం, రెండు ఆపరేషన్ థియేటర్లు, పురుషులు, స్త్రీలు, పిల్లలకు వేర్వేరు వార్డులను ఏర్పాటుచేశారు. లేబొరేటరీ, ఈసీజీ, ఎక్స్‌రే, ఆక్సిజన్ ప్లాంట్, మార్చురీ విభాగం సహా ఆసుపత్రి సన్నద్ధమైంది. కొల్లిపర ప్రాంతం నుంచి ఏ వైద్యానికైనా రోగులు బయటకు వెళ్లాల్సిన అగత్యం ఇకపై ఉండదన్న భావన వ్యక్తమవుతోంది.



లేబొరేటరీని సిద్ధం చేస్తున్న సిబ్బంది

మారిపోయిన ఆసుపత్రి ముఖచిత్రం

రంగు వెలిసిన భవనాలు, అరకొర వైద్యసదుపాయలు, వైద్యులు, సిబ్బంది కొరత. ఉన్న ముగ్గురు నలుగురు వైద్యుల్లోనూ వైరుధ్యాలు.. ఒకరిపై ఒకరు ఫిర్యాదులు. వెరసి కృష్ణానది ఒడ్డునే గల కొల్లిపరలోని 30 పడకల సామాజిక ఆర్యోగ కేంద్రం రోగుల ఆరోగ్య అవసరాలను తీర్చలేని పరిస్థితి. తమ అనారోగ్య సమస్యలకు రోగులు తెనాలి లేదా విజయవాడకు వెళుతుండేవారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆసుపత్రి ముఖచిత్రమే మారిపోయింది. మత్తు డాక్టరు (ఎనస్థీషియా) సహా ఎనిమిది మంది స్పెషలిస్టు డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఆధునిక లేబ్‌లో అవసరమైన పరీక్షలు చేస్తున్నారు. తగిన మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో సేవలు మెరుగయ్యాయి. ఫలితంగా ఔట్ పేషెంట్లు పెరిగారు. ప్రస్తుతం రోజుకు 150-200 మంది వస్తున్నారు. పేరుకు 30 పడకల ఆసుపత్రి అయినా ఏనాడూ ఇక్కడ ప్రసవాలు జరిగింది లేదు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత లక్ష్మి వైద్యాధికారిణిగా బాధ్యతల్లోకి వచ్చాక ఏడాదికాలంగా ఇక్కడ నెలకు పది ప్రసవాలు జరుగుతున్నాయి.



కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రం (ఫైల్ ఫొటో)

ప్రభుత్వ ప్రాధాన్యతకు ప్రత్యక్ష నిదర్శనం...



రాష్ట్రప్రభుత్వం వైద్యరంగానికి ఇస్తున్న ప్రాధాన్యతకు కొల్లిపరలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నిలువెత్తు నిదర్శనం. కరనా రోజుల్నుంచి ఎమ్మెల్యే శివకుమార్ కృషితో ఇక్కడ వైద్యసేవలు మెరుగయ్యాయి. ఇప్పుడు ఏకంగా రూ.8.72 కోట్లతో అత్యాధునిక భవన సముదాయం వచ్చింది.

– బొమ్మారెడ్డి ప్రభాకరరెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు

కార్పొరేట్ స్థాయిలో ఆరోగ్యకేంద్రం



నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల స్థాయిలో కొల్లిపరలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. స్పెషలిస్టు డాక్టర్లు, సిబ్బందితో ఇప్పటికే పూర్తిస్థాయి సేవలను అందిస్తున్న ఆసుపత్రికి ఆధునిక భవన సముదాయం, ఇతర విభాగాలతో రోగులకు సంతృప్త స్థాయిలో సేవలు అందించగలుగుతుంది. మా హయాంలో ఈస్థాయి ఆసుపత్రి రావటం ధన్యులం.

– భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, ఎంపీపీ, కొల్లిపర

ఆరోగ్య సమస్యలకు ఇక్కడే వైద్యం



కొల్లిపరలో సామాజిక ఆరోగ్య కేంద్రానికి నూతన భవన సముదాయాన్ని ప్రభుత్వం నిర్మించటం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే ఎమ్మెల్యే శివకుమార్ తీసుకున్న శ్రద్ధతో డాక్టర్లు, సిబ్బంది వచ్చారు. ఇప్పుడు కొత్త భవనం వచ్చింది. వైద్యం కోసం ఎక్కడకూ వెళ్లాల్సిన పనిలేదు. నా హయాంలో ఇంత గొప్ప ఆసుపత్రి రావటం సంతోషంగా ఉంది.

– పిల్లి రాధిక, గ్రామ సర్పంచ్, కొల్లిపర

వైఎస్సార్ సీపీకి అధికారం ఖాయం

ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ సోషల్ మీడియా ఆత్మీయ సమావేశాన్ని శుక్రవారం స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి సోషల్ మీడియా పనితీరును అభినందించారు. గత ఎన్నికల్లో పార్టీ విజయంలో సోషల్ మీడియా కృషి ఎంతగానో ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామన్న ధీమాను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోషల్‌మీడియా ప్రతినిధులు ఎమ్మెల్యే శివకుమార్‌ను భారీ గజమాలతో సత్కరించారు. జ్ఞాపికను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, సోషల్ మీడియా గుంటూరు జిల్లా కన్వీనర్ మేకా రామిరెడ్డి, కో-కన్వీనర్ నీలి అజయ్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ రబ్బురాజ్, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన అవసరం

తెనాలి అర్బన్: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లెప్రో సొసైటీ సంస్థ ప్రతినిధి అబ్దుల్ వహీద్ బాషా తెలిపారు. జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాలలో భాగంగా సుల్తానాబాద్‌లోని మేరీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేకుండా మచ్చలు ఉంటే వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. కుష్ఠు వ్యాధి నివారణకు మందులు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో లెప్రో సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త రాధిక, కళాశాల ప్రిన్సిపాల్ ఎ. సురేష్ బాబు, రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు



పారాయణం చేయిస్తున్న విజయేశ్వరి దేవి, బాలస్వామి

తెనాలి టౌన్: పట్టణంలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో శ్రీ విద్యాపీఠం, సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర సప్తాహ వైభోత్సవాలు శుక్రవారం ఐదో రోజుకు చేరాయి. శ్రీ గోవింద నామ జపయజ్ఞం పూర్ణాహుతిని వేద పండితులు నిర్వహించారు. శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామీజీ పర్యవేక్షణలో స్వామికి విశేష పూజలు జరిపారు. విశ్వశాంతి ఆశ్రమ ట్రస్ట్ పెనుశీల క్షేత్రం వ్యవస్థాపకురాలు శ్రీ విజయేశ్వరి దేవి 10వేల మంది భక్తులతో లలిత సహస్ర పారాయణం చేయించారు. డాక్టర్ అనంతలక్ష్మి వేంకటేశ్వరస్వామి వైభవాన్ని తెలియజేశారు. పూజ్యశ్రీ బాలస్వామీజీ మాట్లాడుతూ శనివారం వెంకటేశ్వర స్వామి పద్మావతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠ ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, సెక్రటరీ వుప్పల నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, రామకృష్ణ, నాగేశ్వరరావు, గుడివాడ శివప్రసాద్, లోకనాథం, మఠం సభ్యులు, శ్రీ విద్యాపీఠం, విజయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. సుమారు 10వేల మందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉద్యోగాలకు 61 మంది ఏఎస్ఎన్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ సదర్‌లాండ్ తెనాలిలోని ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో తొలిసారిగా నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 61 మంది ఫైనలియర్ డిగ్రీ విద్యార్థుల్ని ఉద్యోగాలకు తీసుకున్నారు. వీరికి ఏడాదికి రూ.3 లక్షల చొప్పున వేతనం ఇస్తారనీ, ఎంపికైన వారంతా బీసీఏ, బీకాం, బీఎస్సీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులేనని ఏఎస్ఎన్ విద్యాసంస్థల ఛైర్మన్, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. డిగ్రీ చదువుతూనే అత్యాధునికమైన ఏఐ, రోబోటిక్ ఆటోమేషన్ టెక్నాలజీని అందించే సదర్‌లాండ్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషమని పేర్కొన్నారు. అకడమిక్ సిలబస్ బోధనతోనే సరిపెట్టకుండా, కంపెనీలకు అవసరమైన ప్రోగ్రామ్‌లను డిజైన్ చేసి, విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఆ క్రమంలోనే ఏఐ, రోబోటిక్ ఆటోమేషన్ టెక్నాలజీని అందించే సంస్థకు ఏకంగా 61 మంది ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థుల్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో నిత్య సహాయమాత మహోత్సవం



నిత్య సహాయమాత స్వరూపంతో ప్రదక్షిణ నిర్వహిస్తున్న ఫాదర్‌లు, గురువులు

తెనాలి టౌన్: పట్టణ చెంచుపేటలోని నిత్యసహాయ మాత(ఆర్‌సీఎం) చర్చి మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నిత్యసహాయ మాత దేవాలయంలో ఉదయం దివ్యబలిపూజను జరిపారు. విజయనగరం విచారణ గురువులు మార్నేని లూర్దు పర్యవేక్షణలో నిత్యసహాయమాత స్వరూపంతో ప్రదక్షణ చేశారు. వేడుకలు సందర్భంగా చర్చికి విద్యుత్ అలంకరణ చేశారు. సాయంత్రం ఆవరణలో సమిష్టి దివ్య బలిపూజను గురుశ్రీ రెవరెండ్ ఫాదర్ ఆంథోని విన్సెంట్ నిర్వహించారు. గుంటూరు మేత్రాసనం పరిధిలోని పలు విచారణకు చెందిన గురువులు, ఫాదర్లు పాల్గొన్నారు. దివ్యబలి పూజలో ఆంథోని విన్సెంట్ వాక్యోపదేశం అందించారు. యేసుక్రీస్తు బోధనల్ని ఆచరించాలని సూచించారు. నిత్యసహాయమాతను వేడుకున్నట్లయితే కోరిన కోర్కెలు నేరవేరుతాయని తెలిపారు. తెనాలి డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన క్రైస్తవులు వేల సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గురుశ్రీ కోయ స్లీవ, గురుశ్రీ ఆంథోని విన్సెంట్, గురుశ్రీ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు. విచారణకు చెందిన కన్యా స్త్రీలు, ఉపదేశీలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సవ ఏర్పాట్లకు సహకరించారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న అతిథులు

తెనాలి రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందని సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. పట్టణ నాజరుపేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ 52వ వార్షిక బహుమతి ప్రదానోత్సవంలో ఆయన శుక్రవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్కూల్ డైరెక్టర్ కె. యాని అరుణలత సభకు అధ్యక్షత వహించి, స్కూల్ వార్షిక నివేదికను వివరించారు. స్కూల్ చైర్మన్ డాక్టర్ జె. సూరజ్‌మోహన్ సాధించిన అభివృద్ధి, లక్ష్యాలను తెలియజేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్, డాన్స్, మ్యూజిక్, డిబేట్, ఫ్యాన్సీ డ్రస్, క్విజ్ పోటీలో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కె. ప్రసాద్, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ బి. వినీల, పూర్వ విద్యార్థులు డాక్టర్ పి. అపర్ణ, డాక్టర్ ఎం. ధీరజ్‌కుమార్, విద్యార్థులు, తలిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



తెనాలి రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి-విజయవాడ రైలు మార్గంలోని కొలనుకొండ సమీపంలో సుమారు 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న మహిళ శుక్రవారం రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'తెలుగు జ్యోతి' పత్రికలో పూర్ణ ప్రజ్ఞాచారి పద్యాలు



ప్రజ్ఞాచారి

తెనాలి టౌన్: అమెరికాలోని న్యూజెర్సీ పట్టణంలో తెలుగు వారి ఆధ్వర్యంలో నడుస్తున్న 'తెలుగు జ్యోతి' పత్రికలో రూరల్ మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీరత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి పద్యాలు తెలుగు సౌరభం అనే శీర్షిక పేరుతో ప్రచురింపబడ్డాయి. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తెలుగు జ్యోతి పత్రిక యాజమాన్యం నిర్వహించిన కవితల పోటీల్లో పద్యాలు ఎంపికై ప్రచురింపబడినట్లు ప్రజ్ఞాచారి శుక్రవారం తెలిపారు. సాహితీ ప్రక్రియలో వస్తువు, శిల్పం సమాన స్థాయిలో ఉన్నప్పుడు ఆ కవితం అమెరికాకే కాదు ఖండాలు దాడిపోయే శక్తి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాచారిని గ్రామంలోని పలువురు కవులు, కళాకారులు అభినందించారు.

చెత్త సేకరణపై శ్రద్ధ చూపాలి

చైర్‌పర్సన్ రాధిక



పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

తెనాలి అర్బన్: పట్టణంలో చెత్త సేకరణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 30వ వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు. పారిశుద్ధ్య పనులు, మురుగు కాల్వల పూడికతీత పనుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తడి, పొడి, హానికర చెత్తలను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొమరబత్తిని జయపాల్, తోట రఘురామ్, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె. హెలెన్ నిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనుపమ, ఆర్‌ఐ మోహనకృష్ణ, ఏసీపీ సుబ్బారావు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఏఎస్పీ సుప్రజ

పట్నంబజారు: జిల్లాలోని పలు స్టేషన్ల పరిధిలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు పోలీసులు రికవరీ చేసి అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం అడ్మిన్ అడిషనల్ ఎస్పీ కె.సుప్రజ వాటిని బాధితులకు అప్పగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సెల్‌ఫోన్ రికవరీల్లో భాగంగా రూ. 43.26 లక్షల విలువ చేసే 144 వివిధ బ్రాండ్ ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ. 2.50 కోట్లు విలువ చేసే ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు వెల్లడించారు. ఫోన్ల రికవరీలో ఐటీ కోర్ సిబ్బంది, అధికారుల పనితీరు అభినందనీయమన్నారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు 8688831574కు సమాచారం అందించి, దరఖాస్తు సేవలు వినియోగించుకోవడం ద్వారా ఎఫ్ఐఆర్ లేకుండా సెల్‌ఫోను రికవరి చేస్తామని చెప్పారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారంతా సీఈఐఆర్ సిటిజన్ పోర్టల్ ద్వారా సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఐకమత్యంతోనే సామాజిక అభివృద్ధి

నెహ్రూనగర్: ఐకమత్యంతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తెలిపారు. పాత గుంటూరులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక సంఘాన్ని రజకులే కాపాడుకోవాలని, కొందరు వ్యక్తులు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. స్వార్థం కోసం సంఘాన్ని పావుగా వాడుకుంటూ అసత్య ప్రచారాలు సమంజసం కాదని తెలిపారు. రజకులంతా ఐక్యమై సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సంఘ నాయకులు ఈమని ఉమామహేశ్వరరావు, నరసింహారావు, వీరవల్లి శ్రీనివాసరావు, గంధం గోపి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలి



సిల్ట్ తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలి రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ మరింత మెరుగుపడాలని మున్సిపల్ కమిషనర్ పి. శేషన్న సిబ్బందికి సూచించారు. పట్టణంలోని 2, 3 డివిజన్లలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ, మురుగు కాల్వల్లో సిల్ట్ తొలగింపును శుక్రవారం ఆయన పరిశీలించారు. వ్యాపారులు 50 మైక్రాన్‌లలోపు ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని ఆయన సూచించారు. టీ స్టాళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా డస్ట్‌బిన్లను వినియోగించల్సిందేనని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారికి రూ. 500 నుంచి రూ. 2000 వరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కమిషనర్ వెంట డీఈలు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సంతోషం కురిపించన్







తెనాలి పట్టణంలోని 40 వార్డుల్లో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. వార్డు వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు.

– తెనాలి అర్బన్